కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
గురువారం • 30-04-2026
పేజీలు: 4



SINGLE TOPIC

పాపులారిటీ.. పరేషాన్



ఏఐ ఇమేజ్

# సెలబ్రిటీస్.. కాంట్రవర్సీస



## వరుస వివాదాల్లో సినీ తారలు

- బిగ్ బాస్ ఫేమ్ అషురెడ్డిపై మోసం చేశారనే ఆరోపణలు
- సింగర్ మంగ్లీపై మైక్రో ఫైనాన్స్ కేసు
- సబ్ స్క్రిప్షన్ ఫీచర్ వివాదంలో విష్ణు ప్రియ
- ప్రైవేట్ ప్రోగ్రామ్‌కు గవర్నమెంట్ కారులో వెళ్లిన నిధి అగర్వాల్




ఏఐ ఇమేజ్

రీల్ లైఫ్‌లో రంగుల ప్రపంచాన్ని ఆస్వాదించే కొందరు.. రియల్ లైఫ్‌లో వివాదాల సుడిగుండంలో చిక్కుకుంటున్నారు. ఒకప్పుడు కేవలం నటనతో, ఆకర్షణతో వార్తల్లో నిలిచిన సెలబ్రిటీలు.. ఇప్పుడు మాత్రం కేసులు, ఆడియో లీకులు, ఆర్థిక కుంభకోణాలతో హెడ్‌లైన్స్‌కెక్కారు. కొందరు ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ పబ్లిసిటీని ఆయుధంగా చేసుకుని క్రేజ్ పొందాలని చూస్తుంటే.. మరికొందరు తాము చేసిన చిన్న పొరపాట్లు లేదా అనుకోని ఆర్థిక లావాదేవీల వల్ల ఠాణా మెట్లు ఎక్కుతున్నారు.

మంగ్లీపై వస్తున్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ ఆరోపణల నుంచి, అషు రెడ్డి చుట్టూ ముసురుకున్న కోట్లాది రూపాయల చీటింగ్ కేసు వరకు.. విష్ణుప్రియ సబ్‌స్క్రిప్షన్ మోడల్ వివాదం నుంచి, డింపుల్ హయాతి పనిమనిషి వేధింపుల కేసు వరకు.. ప్రతీదీ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది.

క్రేజ్ కోసం చేసే సాహసమా? లేక కాసుల వేటలో పడి చేస్తున్న తప్పిదమా? అనేదానిపై కలం స్పెషల్ స్టోరీ..

- సెంట్రల్ డెస్క్, కలం

కలం
ప్రజల గళం...

SINGLE TOPIC

గురువారం
30.04.2026

kalamdaily.com
Follow on: Kalamtelugu

# పాపులారిటీ.. పరేషాన్




ఏఐ ఇమేజ్

హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వై.వి. ధర్మేంద్రను పెండ్లి చేసుకుంటానని నమ్మించి, అతని వద్ద నుంచి సుమారు రూ. 9.35 కోట్లు, 5 కిలోల బంగారం, విలాసవంతమైన కార్లు, ప్లాట్లు వసూలు చేసిందని అషు రెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ మూర్తి హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అషు రెడ్డితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది. షేక్‌పేటకు చెందిన సత్యనారాయణ కొడుకు ధర్మేంద్ర లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు.2018లో ఇండియాకు వచ్చిన సమయంలో ధర్మేంద్రకు అషురెడ్డి పరిచయమైంది. అమెరికాలో చదువు పూర్తి చేసి సినిమాల్లో అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చినట్లు చెప్పింది.

- ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు చెప్పిన వివరాల ప్రకారం..‘‘ పరిచయమైన కొద్ది రోజుల్లోనే ప్రేమిస్తున్నట్లు ధర్మేంద్రకు అషురెడ్డి చెప్పింది. పెండ్లి చేసుకుందామని చెప్పింది. ఆర్థిక అవసరాల పేరుతో డబ్బులు అడగడం ప్రారంభించింది. సంబంధం ఖాయం చేస్తున్నామంటూ పంతుల్ని పిలిపించి అషు రెడ్డి ఫ్యామిలీ హడావుడి చేసింది. తర్వాత ముఖం చాటేసింది. పెండ్లికి నిరాకరించారు. అషు రెడ్డి సోదరి రూ.50 లక్షలు తీసుకుంది’’అని ఆయన పేర్కొన్నారు. సీసీఎస్ పోలీసులు నాన్ బెయిలెబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బిగ్‌బాస్ ఫేమ్ అషు రెడ్డి

- ఈ వ్యవహారంపై అషు రెడ్డి నేరుగా స్పందించకుండా.. సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ‘‘నాపై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. పూర్తిగా నిరాధారమైనవి. నా ప్రతిష్టను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. నన్ను వ్యక్తిగతంగా వేధిస్తున్నారు. సోషల్ మీడియాలో లేదా ఇతర వేదికల ద్వారా నాపై తప్పుడు వార్తలు ప్రచారం చేసేవారిపై పరువు నష్టం దావా వేస్తా’’అని హెచ్చరించారు.



- ధర్మేంద్ర ఎవరో కూడా తెలియదని అషు రెడ్డి తండ్రి కొయ్య వెంకట కృష్ణా రెడ్డి మీడియాకు తెలిపారు. ‘‘నా కూతురుకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదు. ఆమె అమాయకురాలు. ఆమె కెరీర్ విషయాలన్నీ ఆమె తల్లే (యశోధ రెడ్డి) చూసుకుంటారు. ఆర్థిక లావాదేవీలు జరిగి ఉంటే వాటికి సంబంధించిన ఆధారాలు చూపాలి. ధర్మేంద్రకు ఇప్పటికే పెండ్లి అయిందన్న విషయం లేట్‌గా తెలిసింది. ఇది తెలిశాక అతనికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాం’’అని ఆయన పేర్కొన్నారు.

- 2018 నుంచి 2025 వరకు అషు రెడ్డికి వివిధ రూపాల్లో ఆర్థిక సహాయం చేశానని ధర్మేంద్ర తెలిపారు. ‘‘సుమారు 9.35 కోట్లు వివిధ విడతల్లో బదిలీ చేశా. దాదాపు 5 కిలోల బంగారు ఆభరణాలు కొనిచ్చా. నా డబ్బుతో అషు రెడ్డి పేరు మీద ప్లాట్లు, విలాసవంతమైన కార్లు కొనిచ్చా. పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసింది. 2020లో బ్రేకప్ చెప్పింది. మళ్లీ 2023లో తిరిగి కలిశాం. చివరకు 2025 జులైలో మళ్లీ పెండ్లికి నిరాకరించింది. డబ్బులు, ఆస్తులు తిరిగి ఇవ్వాలని కోరితే రివర్స్ నన్నే బెదిరించింది’’అని ధర్మేంద్ర పేర్కొన్నారు.

## ఆడియో లీక్.. హైకోర్టును ఆశ్రయించిన అషు రెడ్డి

తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక ఆడియో.. కేసుకు కీలక మలుపు తీసుకొచ్చింది. వాట్సాప్ ద్వారా పంపినట్లు చెప్తున్న ఈ వాయిస్ మెసేజ్‌లో, “మే వరకు సమయం ఇస్తే కోటిన్నర రూపాయలు ఇస్తాను. మిగతావి తర్వాత చెల్లిస్తాను” అని అషురెడ్డి చెప్పినట్లు వినిపిస్తోంది. ఈ ఆడియోలో జ్యోతిష్కుడు వేణు స్వామి పేరు ప్రస్తావన రావడం మరింత చర్చకు దారి తీసింది. “నీ వైపు నుంచి వేణు స్వామిని తీసుకురావచ్చు లేదా ఇంకెవరినైనా తీసుకురావచ్చు” అంటూ అషురెడ్డి చెప్పినట్లు వినిపిస్తోంది. కేసు కొట్టేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై వస్తున్న ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. ఈ మేరకు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మే 4వ తేదీకి వాయిదా వేసింది.

## మంగ్లీపై మైక్రో ఫైనాన్స్ స్కామ్ ఆరోపణలు

ప్రముఖ జానపద గాయని మంగ్లీ కూడా వివాదాల్లో చిక్కుకున్నారు. మంగ్లీ.. ఆమె తమ్ముడు శివ, మధు అనే మరో వ్యక్తి కలిసి దాదాపు 100 మందిని మోసం చేశారని ఆరోపణలున్నాయి. గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ద్వారా మైక్రో ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి దాదాపు రూ.10 కోట్లకు టోకరా పెట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మంగ్లీ, ఆమె తమ్ముడు శివ, మరికొందరిపై అడ్వకేట్ సుబ్బారావు అనే వ్యక్తి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. బాధితుల పక్షాన నిలబడి డబ్బు తిరిగి అడిగినందుకు తనను చంపేస్తానని బెదిరించారని ఫిర్యాదులో సుబ్బారావు పేర్కొన్నారు. ఈ కేసు వ్యవహారంలో ప్రధాన నిందితుడు రమావత్ మధును సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.

- స్కామ్‌లో తన పేరు అనవసరంగా లాగుతున్నారని, బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ కలిసి నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పంజాగుట్ట పీఎస్‌లో.. ఆ తర్వాత హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కు మంగ్లీ కంప్లైంట్ చేశారు.

- సుబ్బారావు చేసిన ఆరోపణలను మంగ్లీ తీవ్రంగా ఖండించారు. ‘‘నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నేను ఎవరినీ మోసం చేయలేదు. నన్ను బ్లాక్ మెయిల్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు’’అని కన్నీళ్లు పెట్టుకుంటూ పంజాగుట్ట పీఎస్‌లో సుబ్బారావుపై కౌంటర్ కేసు పెట్టారు. ‘‘నేను కేవలం సింగర్‌ని. ఆర్థిక లావాదేవీలతో నాకు ఎలాంటి సంబంధం లేదు” అని మంగ్లీ పేర్కొన్నారు.

- పోలీస్ రికార్డుల్లో రూ.10 కోట్లు అని ఉన్నప్పటికీ.. ఇది దాదాపు రూ.200 కోట్ల స్కామ్ అని అడ్వకేట్ సుబ్బారావు ఆరోపిస్తున్నారు. మంగ్లీ పాపులారిటీని అడ్డం పెట్టుకుని ఆమె సోదరుడు శివ, ప్రధాన నిందితుడు రమావత్ మధు కలిసి వందలాది మందిని మోసం చేశారని ఆరోపించారు. ఈ స్కామ్‌లో మంగ్లీ డైరెక్ట్ ప్రమేయం ఉందని, ఆమె ఫొటోలు, బ్రాండ్‌ను చూసే ప్రజలు పెట్టుబడులు పెట్టారని చెప్పారు.


- ‘‘సుమారు రూ.200 కోట్ల మైక్రో ఫైనాన్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు మధుతో మంగ్లీకి సంబంధాలు ఉన్నాయి’’అంటూ తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సంపత్ నాయక్ ఆరోపించారు. మంగ్లీని చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రొడ్యూసర్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు.




ఏఐ ఇమేజ్

# యాంకర్ విష్ణు ప్రియ

యాంకర్, నటి విష్ణు ప్రియ భీమనేనికి సంబంధించిన సబ్ స్క్రిప్షన్ మోడల్ వివాదాస్పదమైంది. ఇన్‌స్టాగ్రామ్ లో సాధారణంగా అందరికీ కనిపించే పోస్టులతో పాటు కొంత మంది సెలబ్రిటీలు 'ఎక్స్ క్లూజివ్ కంటెంట్' కోసం సబ్ స్క్రిప్షన్ ఫీచర్ ఉపయోగిస్తుంటారు. విష్ణు ప్రియ తన ఇన్ స్టాగ్రామ్‌లో ప్రత్యేకమైన ఫొటోలు, వీడియోలు చూడాలంటే నెలకు రూ.399 చెల్లించాలని ఆప్షన్ పెట్టింది. విష్ణుప్రియ తన సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి అర్ధనగ్నంగా ఉన్న ఫొటోలు, బోల్డ్ వీడియోలను షేర్ చేస్తున్నదని ఆరోపణలు వచ్చాయి. కేవలం డబ్బులు సంపాదించడం కోసమే ఇలాంటి అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేస్తూ, యువతను పెడదోవ పట్టిస్తోందని విమర్శలు వెల్లువెత్తాయి. విజయవాడ సూర్యారావుపేటలో ఏఐఎస్ఎఫ్ నేతలు ఏప్రిల్ 12న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# అనన్యా నాగళ్ల

విష్ణు ప్రియ తరహాలోనే అనన్యా నాగళ్ల కూడా ఇన్‌స్టాగ్రామ్ 'సబ్ స్క్రిప్షన్ మోడల్' కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. డబ్బులు కట్టిన వాళ్లకే స్పెషల్ కంటెంట్ చూపిస్తున్నారని ట్రోల్స్ వచ్చాయి. కొన్ని రోజుల కింద ఈ వివాదంపై ఆమె స్పందించారు. "నేను సబ్ స్కిప్షన్ ద్వారా వచ్చే డబ్బును సామాజిక సేవ కోసం ఉపయోగిస్తున్నాను. అందులో ఎలాంటి అశ్లీలత లేదు. కేవలం భక్తిపరమైన, వ్యక్తిగత విషయాలే షేర్ చేస్తున్నాను" అని క్లారిటీ ఇచ్చారు. "ఓం నమఃశివాయ" మంత్రాన్ని 21 రోజులు పాటు రోజుకు 108 సార్లు జపిస్తే వచ్చే ప్రశాంతత గురించి సబ్ స్క్రైబర్లకు వివరిస్తున్నట్లు తెలిపారు.

తప్పుడు ప్రచారం చేయొద్దని అనన్యా నాగళ్ల రిక్వెస్ట్ చేశారు. అభిమానులతో మరింత దగ్గరగా ఉండటానికి, అందరం కలిసి ఒక కమ్యూనిటీగా ఏర్పడి సమాజానికి ఏదైనా మంచి చేయాలనేదే తన అసలు ఉద్దేశమని ఆమె వివరించారు.

## నా జీవితం.. నా ఇష్టం

సబ్ స్క్రిప్షన్ నా వృత్తిలో భాగం. నేను ఎంతో కష్టపడి షూటింగ్స్ చేసి, ఫొటో షూట్స్ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న. దానికి తగిన ప్రతిఫలం ఆశించడంలో తప్పులేదు. నా కష్టార్జితమే తప్ప వేరే రకంగా వస్తున్న సొమ్ము కాదు. నా జీవితం.. నా ఇష్టం.. నా శరీరం నా ఇష్టం. ఇతరుల అభిప్రాయాల కోసం నన్ను నేను మార్చుకోను. నచ్చిన బట్టలు వేసుకుంటాను. కంటెంట్‌ను ఎలా ప్రదర్శించాలనేది నా వ్యక్తిగత విషయం. డబ్బుల కోసం ఎవరూ.. ఎవరినీ బలవంతం చేయడం లేదు. నా కంటెంట్ నచ్చినవారు.. నన్ను ఇష్టపడే వాళ్లే సబ్ స్క్రిప్షన్ తీసుకుంటారు. నచ్చనివాళ్లు చూడాల్సిన అవసరం లేదు.

- విష్ణు ప్రియ








## వరుస వివాదాల్లో రీతూ చౌదరి

బుల్లితెర నటిగా, బిగ్ బాస్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న రీతూ చౌదరి.. ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలోనూ ఆమె పేరు బయటికి వచ్చింది. గతంలో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేశానని.. తెలియకుండా చేశానంటూ క్షమాపణలు కూడా చెప్పింది. పోలీసుల విచారణ కూడా ఎదుర్కొన్నారు. లేటెస్ట్‌గాఆమె సోషల్ మీడియాలో చేసిన ఎమోషనల్ పోస్ట్.. హాట్ టాపిక్‌గా మారింది. వ్యక్తిగత జీవితంలో జరిగిన సంఘటనను వివరిస్తూ ఆవేదన వెళ్లగక్కింది. ‘‘నేను ఒక వ్యక్తిని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాను. కానీ, అతను మోసం చేసి వేరే ఆమెతో వెళ్లిపోయాడు’’అంటూ పోస్ట్ చేసింది. ‘నిజాయితీగా ఉన్నందుకు నాకు దక్కిన బహుమతి ఇది’ అంటూ ఆమె చేసిన కామెంట్లు వైరల్ అయ్యాయి.

- గతేడాది రితూ చౌదరికి సంబంధించిన వీడియోలు గౌతమి అనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇది పెద్ద దుమారానికి దారితీసింది. ఈ వీడియోల్లో ధర్మ మహేశ్, రితూ కలిసి ఒక ఫ్లాట్‌లోకి వెళ్లిన దృశ్యాలు ఉన్నాయి. రీతూ చౌదరి, తన భర్త ధర్మ మహేశ్ మధ్య ఏదో సంబంధం ఉందంటూ గౌతమి ఆరోపణలు చేశారు.

- గతంలో ఆమె శ్రీకాంత్ అనే వ్యక్తికి సంబంధించిన రూ.700 కోట్ల స్కామ్ లేదా భూ కుంభకోణం వ్యవహారంలోనూ రీతూ పేరు వినిపించింది. అతనితో విడిపోయిన తర్వాత ఆ ఆస్తులతో ఎలాంటి సంబంధం లేదని ఆమె క్లారిటీ ఇచ్చారు.

- రీతూ తండ్రి చనిపోయిన కొన్ని రోజులకే ఆమె గ్లామరస్ ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంపై నెటిజన్లు ట్రోల్ చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. ‘‘మా నాన్నతో నాకు ఉన్న బాంధవ్యం ఏంటో నాకు తెలుసు. మేము కలిసి మందు కొట్టేవాళ్ళం. ఆయనను ఒరేయ్ అని పిలిచేంత చనువు ఉంది. నా బాధను నేను ఎలా వ్యక్తపరచాలో ఇతరులు చెప్పక్కర్లేదు”అంటూ ఘాటుగా సమాధానమిచ్చారు.

## డింపుల్ హయతి



నటి డింపుల్ హయతికి సంబంధించి ప్రధానంగా 2 పెద్ద వివాదాలు మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. ఒకటి 2023లో జరిగిన ఐపీఎస్ అధికారి కారు వివాదం కాగా, రెండో ఇటీవల వెలుగులోకి వచ్చిన పనిమనిషి వేధింపుల కేసు. ఒడిశాకు చెందిన ప్రియాంక బిబర్ (22) అనే యువతి డింపుల్ ఇంట్లో పనిమనిషిగా చేరింది. అయితే డింపుల్, ఆమె భర్తగా చెప్పబడుతున్న విక్టర్ డేవిడ్ తనను మానసికంగా, శారీరకంగా వేధించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సరిగ్గా ఆహారం ఇవ్వకపోవడం, అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో పేర్కొంది.

- జూబ్లీహిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డింపుల్ హయతి.. అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే కారును తన కారుతో ఢీకొట్టారని ఆరోపణలు వచ్చాయి. పార్కింగ్ విషయంలో గత కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సీసీటీవీ ఫుటేజీలో డింపుల్ కావాలనే అధికారి కారును ఢీకొట్టడం, కారు ముందు ఉన్న ట్రాఫిక్ కోన్లను కాలితో తన్నడం వంటి దృశ్యాలు కనిపించాయి. ఐపీఎస్ అధికారి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, అపార్ట్‌మెంట్ కామన్ ఏరియాలో సిమెంట్ బ్లాక్స్ పెట్టి తనకు ఇబ్బంది కలిగిస్తున్నారని డింపుల్ ఎదురు దాడి చేశారు. ఈ విషయంపై ఆమె హైకోర్టును కూడా ఆశ్రయించారు.



## నిధి అగర్వాల్

నటి నిధి అగర్వాల్ కూడా వరుస వివాదాలతో వార్తల్లో నిలిచారు. చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్, గాంబ్లింగ్ యాప్స్‌ను తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రమోట్ చేశారనే ఆరోపణతో తెలంగాణ పోలీసులు ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో నవంబర్ 2025లో ఆమె హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

- ఆంధ్రప్రదేశ్‌లో భీమవరంలో ఒక ప్రైవేట్ జ్యువెలరీ షాప్ ఓపెనింగ్‌కు వెళ్లినప్పుడు నిధి అగర్వాల్ ప్రయాణించిన కారుపై “ON GOVT DUTY” అనే బోర్డు ఉండటం పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది. ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్తున్న హీరోయిన్‌కు ప్రభుత్వ వాహనాన్ని ఎలా కేటాయిస్తారని విమర్శలు వచ్చాయి. అయితే, దర్యాప్తులో అది మాజీ ఎంపీ భరత్ రామ్‌కు చెందిన ప్రైవేట్ వాహనమని, డ్రైవర్ పొరపాటున ఆ బోర్డు తీయలేదని తేలడంతో వివాదం సద్దుమణిగింది.